క్లుప్తంగా

రేషన్ సక్రమంగా అందజేయాలి



చాగల్లులో డీలర్లతో సమీక్ష జరుపుతున్న తహసీల్దార్ సావిత్రి

చాగల్లు: రేషన్ సరకులను లబ్ధిదారులకు సక్రమంగా అందజేయాలని తహసీల్దార్ ఎం. సావిత్రి సూచించారు. రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో శుక్రవారం ఆమె స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమీక్ష జరిపారు. సమావేశానికి పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్ ఎం.సునీత కూడా విచ్చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సావిత్రి మాట్లాడుతూ ఎండీయూలు, డీలర్లు సమన్వయంతో పనిచేసి సకాలంలో కార్డుదారులకు సరకులను కచ్చితమైన తూకంతో పంపిణీ చేయాలని తెలిపారు. రేషన్ డీలర్లు స్వయంగా మండల స్థాయి స్టాక్ పాయింట్‌కు వెళ్లి కచ్చితమైన తూకంతో సరకులు పొందాలని, ఎలాంటి ఇబ్బందులున్నా తమకు తెలియజేయాలని తెలిపారు. ఎండీయూ ఆపరేటర్లు ప్రతి కార్డుదారుడి ఇంటికి వెళ్లి సరకులు అందజేయాలని కోరారు. సమావేశంలో డీలర్లు గాంధీ, కె.కృష్ణ, కె.సత్యనారాయణ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు నెలల్లో ఎన్డీయే ప్రభుత్వం పడి పోతుంది

గోపాలపురం: కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ఆరు నెలల్లో పడిపోతుందని లిబరేషన్ కాంగ్రెస్ నాయకుడు బొంతా శ్యామ్ రవిప్రకాష్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సార్వత్రిక 400 ఎంపీ సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మార్చివేస్తానని చెప్పిన ప్రధాని నరేంద్ర మోదీకి 240 సీట్లు మాత్రమే వచ్చాయన్నారు. ఎన్డీయే కూటమిలోని 22 ఎంపీలు తమ మద్దతు ఉపసంహరించుకుంటే ప్రభుత్వం పడిపోవడం ఖాయమన్నారు. ప్రధాని నరేంద్ర మోదీకి మద్దతు ఇచ్చేందుకు ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ఇష్టపడడం లేదన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుడు శ్రీనివాస్ కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న ముస్లింలు

నల్లజర్ల: స్థానికంగా ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్న చిటికిన శ్రీనివాస్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన కుటుంబానికి స్థానిక ముస్లింలు శుక్రవారం రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో జమాతే ఇస్లామీ హింద్ మండల శాఖ అధ్యక్షుడు ఎండీ ఇలియాజ్ షరీఫ్, ఎస్‌కే సుభానీ, రఫీ, అజీజ్, అష్రఫ్అలీ, ఎండీ షానూర్ పాల్గొన్నారు.


విద్యార్థులకు నేత్ర పరీక్షలు



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్య బృందం

నిడదవోలు: స్థానిక జెడ్పీ హైస్కూల్లోని సుమారు 200 మంది విద్యార్థులకు శుక్రవారం నేత్ర పరీక్షలు చేశారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద వారి సౌజన్యంతో రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు సెంట్రల్ శాఖ వారు ఈ కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు బొల్లా శ్రీనివాస్‌గౌడ్, బూరుగుపల్లి సత్యనారాయణ, నీరుకొండ సుబ్రహ్మణ్యం, బీఎస్‌వీ ప్రసాద్, చెన్నుల రాజా, కొండేపాటి రామకృష్ణ, ఈదల నాగేశ్వరరావు, గోనెల వీర వెంకట సత్యనారాయణ, పి. సురేష్, అత్కూరి శ్రీనివాస్, విక్రమ్ జైన్, పాల్గొన్నారు.

నేటి నుంచి వేంకటేశ్వర ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు



విద్యుత్ కాంతులతో శ్రీవేంకటేశ్వరస్వామి

ఉండ్రాజవరం: స్థానిక భూ సమేత వేంకటేశ్వరస్వామి వారి ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి బుధవారం వరకూ ఐదు రోజుల పాటు నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. శనివారం సంకల్పం, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనంతో కార్యక్రమాలు ప్రారంభం అవుతాయి. ఆదివారం స్వామి వారికి దివ్య తిరు కల్యాణోత్సవం జరుగుతుంది. సోమవారం సామూహిక లక్ష కుంకుమార్చన, ఐశ్వర్య ప్రాప్తికి శ్రీమహాలక్ష్మి హోమం, మంగళవారం మహా సుదర్శన అభిషేకం, మహా సుదర్శన హోమం, శంఖు, చక్ర నామార్చన, సహస్ర దీపాలంకరణ సేవ, ఊంజల్ సేవ నిర్వహిస్తారు. బుధవారం మహాశాంతి హోమం, మహా పూర్ణాహుతి, శ్రీవారి చక్రస్నానం, అన్న సమారాధన నిర్వహిస్తారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈసందర్భంగా ఆలయం వద్ద విద్యుత్ దీపాలతో అలంకరించారు.

యోగా జీవన విధానం కావాలి

- కొవ్వూరు డివిజన్ వ్యాప్తంగా యోగా దినోత్సవం
- పలుచోట్ల సాధన
- శిక్షకులకు సన్మానం



ఉండ్రాజవరం ఉన్నత పాఠశాలలో ఆసనాలు వేస్తున్న విద్యార్థులు

కొవ్వూరు: యోగా సాధన దైనందిన జీవితంలో భాగం కావాలని, యోగా అనేది శారీరక, మానసిక ఆరోగ్యానికి ఉపకరిస్తుందని వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో యోగా శిక్షణ అందించారు. కోర్టు ప్రాంగణంలో కొవ్వూరు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఇన్‌స్ట్రక్టర్ యోగాసనాలు నేర్పించారు. జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి ఎన్‌.శ్రీనివాసరావు, సీనియర్ సివిల్ జడ్జి వీఎల్ సరస్వతి, ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె. బాలాత్రిపుర సుందరి, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.సాయికృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాగంటి చలపతి, న్యాయవాదులు, న్యాయవాద గుమాస్తాలు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. అలాగే స్థానిక పరిమి రామారాయుడు, రత్తమ్మ కల్యాణ మండపంలో యోగా గురువు కోడూరి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు యోగా నేర్పించారు. పట్టణంలో ఏబీఎన్ అండ్ పీఆర్ఆర్ కళాశాలలో విద్యార్థులకు యోగా నేర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎన్‌వీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. గౌతమీ యోగాస్రవంతి నిర్వాహకులు కె.వల్లీ, ఎం.కనకదుర్గ, ఎం.నాగసుందరి, బీఎస్ కృష్ణమూర్తి సూర్య నమస్కారాలు, యోగా విశిష్టత గురించి వివరించారు. డాక్టర్ వై.రమేష్, ఇతర అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

చాగల్లు మండలంలో..

చాగల్లు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు వేసిన యోగాసనాలు అకట్టుకున్నాయి. యోగా దినోత్సవం సందర్భంగా ఇక్కడ నిర్వహించిన కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయుడు. పి.వీర్రాజు అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ యోగా వలన మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. వ్యాయమోపాధ్యాయుడు నాగరాజు వివిధ రకాల యోగాసనాల గురించి విద్యార్థులకు వివరించారు. అలాగే కలవలపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలోనూ విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. హెచ్ఎం జె.వెంకట శ్రీనివాస్, వ్యాయామోపాధ్యాయుడు కొయ్య గంగాధరరావు యోగా అవశ్యకత గురించి విద్యార్థులకు వివరించారు.



తాళ్లపూడిలో యోగాసనాల సాధన



తాళ్లపూడిలో యోగా గురువు నక్కా వెంకటేశ్వరరావుకు సత్కారం

ఉండ్రాజవరంలో..

ఉండ్రాజవరం: యోగా మన జీవితంలో ఒక భాగం కావాలని ఉండ్రాజవరం ఉన్నత పాఠశాల హెచ్ఎం కేఎస్‌కే మాణిక్యాలరావు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉండ్రాజవరం ఉన్నత పాఠశాలలో యోగా ఉపాధ్యాయులు బిఎస్ఎస్ స్వామి, ఎంఎన్ పుష్పవల్లి ఆధ్వర్యంలో విద్యార్థులతో యోగాసనాలను వేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



దూబచర్ల హైస్కూల్‌లో యోగా గురువు రాజారావును సత్కరిస్తున్న ఎంఈఓలు సత్యనారాయమణ, భగవతి

దూబచర్లలో..

నల్లజర్ల: సంపూర్ణ ఆరోగ్యానికి యోగా ఎంతగానో దోహద పడుతుందని పార్థ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని దూబచర్ల జెడ్పీ హైస్కూల్లో నిర్వహించిన యోగా దినోత్సవంలో ఆయన మాట్లాడుతూ నిత్యం యోగాసనాలు వేసే వారికి మానసిక ప్రశాంతతతో పాటు సంపూర్ణ ఆరోగ్యం కూడా లభిస్తుందన్నారు. యోగా గురువు రాజారావు యోగాసన ప్రక్రియతో పాటు కపాలభాతి, ప్రాణాయామం, ధ్యానం చేయించి వాటి విశిష్టతలను వివరించారు. ఈ సందర్భంగా యోగా గురువు రాజారావును సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ సత్యనారాయణ, ఎంఈఓ-2 భగవతి, ఈఓపీఆర్డీ సింహాద్రి, దూబచర్ల సర్పంచ్ తాడిగడప బాలయ్య, పంచాయతీ కార్యదర్శి బి.రత్నం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.సుమతి, నెక్కంటి వెంకటేష్, చీమకుర్తి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలులో..

నిడదవోలు: స్థానిక ఎస్వీఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఓ.జ్యోతి మాట్లాడతూ ఈ సంవత్సరాన్ని థీమ్ యోగ ఫర్ విమెన్ ఎంపవర్‌మెంట్‌గా ప్రకటించారన్నారు. స్త్రీలు కేవలం ఆర్థికంగా సాధికారత సాధిస్తే సరిపోదని శారీరక మానసిక పరిపుష్టి అవసరమని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిళా సాధికారత శాఖాధిపతి కె.జాస్మిన్, పి.శివాజీ, ఇ. నాగేశ్వరరావు, ఎం. పద్మజ విద్యార్థులు పాల్గొన్నారు.

గోపాలపురంలో..

గోపాలపురం: చిన్న నాటి నుంచి విద్యార్థులు యోగా సాధనను అలవాటు చేసుకోవాలని ఎంఈఓ జి. శ్రీనివాసరావు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ఆయన యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో ఎ.మహేశ్వరరావు, హెచ్ఎం సాయిబాబా, పీఈటీలు భూదేవి, కామేశ్వరి, సీఆర్పీ కొయ్య నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేవరపల్లిలో..

దేవరపల్లి: యోగా దినోత్సవాన్ని దేవరపల్లి మండలంలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల్లో విద్యార్థులకు యోగాపై శిక్షణ తరగతులు నిర్వహించి యోగా వల్ల ఉపయోగాలను వివరించారు. యోగాతోనే మంచి ఆరోగ్యం ఉంటుందని, ప్రతి ఒక్కరు యోగా చేయాలని స్థానిక పూర్ణయోగా గురూజీ రామచంద్రరావు తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నియోజకవర్గ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. భాష్యం స్కూల్లో యోగా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు యోగా ఆసనాలే వేశారు.



నిడదవోలులో యోగాసనాలు



కొవ్వూరులో యోగాసనాలు వేస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది

యోగా, ధ్యానం నిత్యకృత్యం కావాలి

తాళ్లపూడి: ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో యోగా సాధన, ధ్యానం అంతర్భాగం కావాలని, ఈ రెండింటి సాధనతో మెదడులో సానుకూల మార్పులు కలుగుతాయని ఆర్ఎస్ఎస్ ప్రముఖుడు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోడూరి లక్ష్మీనారాయణ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం మండలంలోని పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. తాళ్లపూడిలోని గాయత్రీ యోగా కేంద్రం ఆధ్వర్యంలో యోగాగురువు నక్కా వెంకటేశ్వరరావు పాఠశాలల విద్యార్థులు, యువకులతో యోగాసనాలు వేయించారు. యోగా, ఇతర పోటీల్లో విజేతలు 100 మందికి బహుమతులు అందజేశారు. అనంతరం 40 ఏళ్లుగా ఉచితంగా యోగా నేర్పుతున్న నక్కా వెంకటేశ్వరరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సింహాద్రి జనార్దనరావు, గోకరాజు, ఏఎస్‌వో జె.వెంకటేశ్వరరావు, గాయత్రీ యోగా సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు. అలాగే స్థానిక సూర్య స్కూల్ వద్ద బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు ఇండుగుల రామకృష్ణ, కలిశెట్టి సన్యాసినాయుడు, బొర్రా శ్రీరామచంద్ర మూర్తి పాల్గొన్నారు. వేగేశ్వరపురం ప్రభుత్వ, గజ్జరం జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు వివిధ ఆసనాలు వేశారు. ఎంఈవో సీహెచ్ బాలామణి పాల్గొన్నారు.

నగదు రహిత చెల్లింపులపై అవగాహన

నల్లజర్ల: డిజిటల్ చెల్లింపులు, నగదు రహిత లావాదేవీలపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని యూనియన్ బ్యాంక్ నల్లజర్ల శాఖ మేనేజర్ టి.ఈశ్వర్ సూచించారు. నగదు రహిత చెల్లింపులపై స్థానిక ఎస్ఆర్‌కే కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ వి.అశోక్‌కుమార్, ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆంజనేయులు ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహిరంచారు. కార్యక్రమంలో టి.ఈశ్వర్ మాట్లాడుతూ డిజిటల్ చెల్లింపులు చేయాలని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఓటీపీలను అపరిచిత వ్యక్తులతో పంచుకోవద్దని, సైబర్ క్రైమ్‌కు గురైనపుడు 1930 అనే టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ మేనేజరు బి.గణేష్ మాట్లాడుతూ బ్యాంకు ఖాతా ఉన్న ప్రతి ఒక్కరూ ప్రధానమంత్రి సురక్ష యోజన, ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమాయోజన, సుకన్య సమృద్ధి యోజన, అటల్ పెన్షన్ స్కీమ్‌లను వినియోగించుకోవాలన్నారు. రీసోర్సుపర్సన్లు వై.బాబూరావు, ఎన్.అనిల్‌కుమార్, ట్రైనర్స్ కె. రాజశేఖర్, పి.శ్రీనివాస్‌లు బ్యాంకు లావాదేవీలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆ కళాశాల ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నగదు రహిత చెల్లింపులపై అవగాహన సదస్సులో పాల్గొన్న వివిధ బ్యాంకుల మేనేజర్లు

ఆడుతూ.. చదువుతూ..

- నగర విద్యార్థుల ఘనత
- చదువుతో పాటు క్రీడల్లో ప్రతిభ
- పలు పతకాల కైవసం

ప్రకాశం నగర్: సాంస్కృతిక రాజధాని రాజమహేంద్రవరంలోని విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తున్నారు. స్కేటింగ్, కరాటే పోటీలలో పతకాలు సాధించి నగర ఖ్యాతిని దశదిశలా వ్యాప్తి చేస్తున్నారు. ఇటీవల గోవాలో జరిగిన ఆర్ఎస్ఎఫ్ఐ జాతీయ స్కేటింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో రింక్ 5 రోడ్డు రేస్‌లో కొండి లలిత్ వర్మ బంగారు పతకం, రింక్ 6 విభాగంలో రజిత పతకం సాధించాడు. ఈ ఘనత సాధించిన లలిత్‌ను జిల్లా ఎస్పీ పి.జగదీష్ అభినందించారు. 67 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మధ్య ప్రదేశ్‌లో జరిగిన స్కేటింగ్ పోటీల్లో అండర్ 14 బాలికల విభాగంలో కె.భవ్యశ్రీ, బాలుర విభాగంలో జి.వీర శ్రీవత్సవ్, అండర్ 17 బాలికల విభాగంలో ఎండీ మదసరున్నీసా ప్రతిభ చూపి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. అండర్ 14 బాలికల విభాగంలో కె.భవ్యశ్రీ ఇన్‌లైన్ రోడ్డు రేస్‌లో కాంస్య పతకం సాధించింది.

కరాటేలో బంగారు పతకం

ఇండో నేపాల్ కరాటే చాంపియన్ షిప్ 2024 పోటీలలో ప్రభుత్వ అటానమస్ కళాశాల విద్యార్థి బి.నాగపండు ప్రతిభ చూపాడు. అండర్ 21 కరాటేలో కాటా 60 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించాడు. గతంలో రాష్ట్ర స్థాయిలో, జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన పండు.. ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో కరాటే చాంపియన్‌షిప్ పోటీలో ప్రతిభ చూపాడు. బీఏ తృతీయ ఏడాది ఎకనామిక్స్ చదువుతున్న నాగపండు చదువుతో కూడా చురుగ్గా ఉంటాడు.



జాతీయ స్కేటింగ్ పోటీలో పతకాలు సాధించిన లలిత్ వర్మను అభినందిస్తున్న ఎస్పీ జగదీష్ (ఫైల్)

శిక్షణతో మంచి ఫలితాలు

ప్రతి ఏటా వేసవి క్రీడా శిక్షణ తరగతుల పేరుతో ఒక నెల రోజుల పాటు వివిధ క్రీడాల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తారు. వీటితో పాటు స్కూల్ గేమ్స్ వంటి క్రీడా పోటీల ద్వారా విద్యార్థులలో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఆయా పీడీలు కృషి చేస్తున్నారు.

ప్రమాణ స్వీకారం



తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు ఎమ్మెల్యేగా ముప్పిడి వెంకటేశ్వరరావు అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీలో శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు.

– కొవ్వూరు

నీట్ పరీక్ష రద్దు చేయాలంటూ ఏఐఎస్ఎఫ్ ఆందోళన

మండపేట: నీట్ పరీక్ష ఫలితాల్లో జరిగిన అక్రమాలపై సుప్రీం కోర్టు న్యాయమూర్తితో సమగ్ర విచారణ జరిపించి, అవసరమైతే ఆ పరీక్షను, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)ని రద్దు చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా కార్యదర్శి రవికుమార్ డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం మండపేట కలువ పువ్వు సెంటర్లో వందలాది విద్యార్థులు నిరసన తెలిపారు. నీట్ పరీక్షను రద్దు చేయాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఎన్టీఏ విడుదల చేసిన నీట్ ఫలితాల్లో దేశ వ్యాప్తంగా 67 మంది విద్యార్థులకు 720 మార్కులకు 720 రావడం, వారిలో ఆరుగురు హర్యానాలోని ఒకే సెంటర్ వారు కావడంతో అనేక అనుమానాలు రేకెత్తిస్తున్నాయన్నారు. సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యల తీసుకోవాలని కోరారు.

మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తు

- ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు
- డిగ్రీ కళాశాల విద్యార్థులకు అవగాహన

కొవ్వూరు: డ్రగ్స్ రహిత సమాజ స్థాపనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) ఇన్‌స్పెక్టర్ జి. శ్రీనివాసరావు కోరారు. యాంటీ డ్రగ్స్ వారోత్సవ సభను శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. మాదక ద్రవ్యాల వినియోగం ద్వారా కలిగే అనర్థాల గురించి ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు వివరించారు. దేశ భవిష్యత్తును కుంగదీసే మాదక ద్రవ్యాల వ్యాప్తిని పకడ్బందీగా అరికడదామన్నారు. మత్తు పదార్థాలకు బానిసైతే కలిగే దుష్పరిణామల గురించి వారికి వివరించారు. ఈనెల 26న నిర్వహించే ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవంలో భాగంగా యువతలో అవగాహన పెంచేందుకు ఇలాంటి సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. డ్రగ్స్ వాడకంతో సామాజిక, మానసిక, శారీరక అనారోగ్యాలు తలెత్తుతున్నాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జె.సునీత, ఇతర అధ్యాపకులు,ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి వైద్యురాలు డి. సత్యకుమారి, అధ్యాపకులు పాల్గొన్నారు.

నిడదవోలులో..

నిడదవోలు: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఈబీ నిడదవోలు ఇన్‌స్పెక్టర్ కె.వీరబ్రహ్మం సూచించారు. డ్రగ్స్ అక్రమ రవాణా, డ్రగ్స్ వాడకం వలన కలిగే అనర్థాలపై శుక్రవారం పట్టణంలోని అన్నపూర్ణేశ్వరి ఒకేషనల్ జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. యువత డ్రగ్స్‌కు బానిసతే కలిగే దుష్పరిణామాలు, చట్టాలు, శిక్షల గురించి ఈ సందర్భంగా వీరబ్రహ్మం విద్యార్థినులకు వివరించారు. మత్తు పదార్థాల వాడకంతో మానసిక, శారీరక అనర్థాలు తలెత్తుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఈబీ ఎస్సై ఆర్. దొరబాబు, కళాశాల ప్రిన్సిపాల్ ఎం. విజయసారథి సిబ్బంది పాల్గొన్నారు.



కొవ్వూరు కళాశాలలో అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఈబీ సీఐ శ్రీనివాసరావు



నిడదవోలులో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ వీరబ్రహ్మం

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

గోపాలపురం: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, గంజాయి, డ్రగ్స్ నియంత్రణలో ప్రభుత్వానికి సహకరించాలని ఎస్ఈబీ దేవరపల్లి సీఐ కేవీ స్వామి కోరారు. డ్రగ్స్ అండ్ నార్కోటిక్స్ వాడకం, రవాణాపై స్థానిక గౌతమి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ స్వామి మాట్లాడుతూ యుక్త వయస్సులో చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. దొండపూడిలో 20 లీటర్ల సారాతో ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్టు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై పి. సుధీర్, కళాశాల ప్రిన్సిపాల్ కేఎస్‌డీ ఆశీర్వాదం, విద్యార్థులు పాల్గొన్నారు.



గోపాలపురం గౌతమీ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దేవరపల్లి సీఐ స్వామి

సీతారామ్‌కు ఉత్తమ సంఘ సేవకుడి అవార్డు

కొవ్వూరు: పట్టణానికి చెందిన కసిరెడ్డి సీతారామ్‌కు ఉత్తమ సంఘ సేవకుడి అవార్డు లభించింది. అమలాపురానికి చెందిన గారపాటి వీర్రాజు మెమోరియల్ ట్రస్టు రెండో వార్షికోత్సవం సందర్భంగా ఆ సంస్థ ఆయనకు ఈ అవార్డు ప్రదానం చేసింది. సుందర సాయి ట్రస్టు, శివసాయి దామం సేవాసమితి ద్వారా సీతారామ్ కొవ్వూరు పరిసర ప్రాంత పేదలకు, అనాథలకు నాలుగు దశాబ్దాలుగా వివిధ రకాల సేవలు అందించినందుకు గాను ఆయనకు ఈ అవార్డు ప్రదానం చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. గారపాటి వీర్రాజు మెమోరియల్ ట్రస్టు అధ్యక్షుడు గారపాటి సూర్యనారాయణ చేతుల మీదుగా శుక్రవారం అమలాపురంలో సీతారామ్‌ను సత్కరించి అవార్డు, జ్ఞాపిక అందజేశారు.ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.



కసిరెడ్డి సీతారామ్‌ను సత్కరిస్తున్న గారపాటి వీర్రాజు మెమోరియల్ ట్రస్టు సభ్యులు

ఏఎంసీ చైర్‌పర్సన్ రోజారమణి రాజీనామా

రాజోలు: రాజోలు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుబ్బల రోజారమణి శుక్రవారం రాజీనామా చేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో పార్టీ ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ ఆమె రాజీనామా పత్రాన్ని మార్కెట్ కమిటీ అధికారులకు అందజేశారు. అలాగే ఏఎంసీ వైస్ చైర్మన్ సుంకర బాబ్జి కూడా తన పదవికి రాజీనామా చేశారు. రాబోయే కాలంలో వైఎస్సార్ సీపీ అధినాయకత్వం సూచనల మేరకు పార్టీ కార్యకర్తలకు అండగా నిలుస్తామన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు గుబ్బల మనోహర్ పాల్గొన్నారు.



రాజీనామా పత్రాన్ని అందిస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ రోజారమణి

పాముకాటుతో మహిళ మృతి

మామిడికుదురు: పాశర్లపూడి సత్తరువుతోటకు చెందిన వనమాడి అంజలీదేవి (38) పాము కాటుకు గురై శుక్రవారం మృతి చెందిందని నగరం ఎస్సై పి.సురేష్ తెలిపారు. ఇంటి వద్ద గురువారం ఉదయం అంజలీదేవి వాకిలి తుడుస్తుండగా రక్త పింజర ఆమెను కాటు వేసిందన్నారు. కుటుంబ సభ్యులు అమలాపురం ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందిందన్నారు. మృతురాలి భర్త శ్రీమన్నారాయణ ఫిర్యాదు మేరకు దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.